# "మాంజా" దారం

చాగంటి తులసి

"ఏమండోయి. మావయ్యగారూ, తీసుకొచ్చేరూ?" అని నేను ఆయనతో అంటూనే ఉన్నాను. ఆయన నామాట వినిపించుకోలేదు.

"నీకు సమాధానా లెవడు చెప్తాడయ్యా? నీకోసం ఏమీ రాలేదు. మా అమ్మాయిదగ్గిరికి పోతే ఇంత కాఫీ అయినా యిస్తుంది" అని అంటూ ఆయనలోపలికి వెళ్ళిపోయాడు. నేనూ ఆయనవెనకే వెళ్ళేను. మా ఆవిడ కాఫీ అప్పుడే చల్లారపోస్తున్నాది. చలికాలమేమో కాఫీ చూస్తేనే ప్రాణం లేచొస్తున్నట్టుంది.

"ఆకాఫీ అలాపెట్టి ఇవి ముందు పెట్టుకో", అని మావయ్యగారు అరిటాకుతో పదిలంగా కట్టిన పొట్లాం విప్పి చేమంతిపువ్వులూ, వాడంబరాలు, మరువంచిగుళ్ళూ కలిపికట్టిన దండ మా ఆవిడ కిచ్చారు.

"పెట్టుకుంటా కాని ముందు కాఫీతాగండి," అని మా ఆవిడ గ్లాసునిండా కాఫీపోసి ఆయనముందరపెట్టి దండపుచ్చుకుంది. మావయ్యగారు వరుసకు మావయ్యగారు కాని నాకూ బంధువుకాడు. మా ఆవిడకీ బంధువుకాడు. మా యింటికి నాలుగిళ్ల అవతల వాళ్లిల్లు. అదే మాకూ ఆయనకీ బంధుత్వం. చిన్నడాబా, చిన్నదొడ్డీ, స్వంతయిల్లే. దొడ్డి చిన్నదైనా మొక్కలతో ఎప్పుడూ కలకల్లాడుతూఉంటుంది. తెల్లవారుఝామున నాలుగుగంటలకి లేచి నూతిలో నీళ్ళన్నీ ఆ మొక్కలకి ఎత్తిపోస్తాడు. పువ్వులుకోసి ప్రత్యేకం మా ఆవిడకి తెచ్చిపెడతాడు. ఆ దండ స్వయంగా తనే కడతాడు. ఇంకెవరు కట్టినా అతనికి నచ్చదు కూడా. "పువ్వులన్నీకోసి చాలామంది దేవుడికి పూజ చేస్తారు. ఒక్కొక్కరు చెట్టుపువ్వు చెట్టునే ఉంచి సంతోషిస్తారు. నాకు రెండూ నచ్చవు. దిమ్మాదిరగా పువ్వులు పూయించాలి. ఆడవాళ్లు పెట్టుకోవాలి. అప్పుడే పువ్వులకి విలవని నాఅభిప్రాయం," అని మావయ్యగారు చెప్పిందే చెప్తూ ఉంటారు.

మావయ్య కాఫీతాగి "అల్లుడూ ఒక్క రూపాయుంటే యిద్దూ. చిన్న సరదా చేస్తాను" అన్నారు.

ఉండాలికాని ఉంటే మావయ్య చాలా సరదాలే చేస్తాడు. లేకపోయినా అంతా సరదాయే. పస్తు పడుకున్నా పరమాన్నం తిన్నట్టు కనపడతాడు. అరవైఏళ్లొచ్చినా ఆరేళ్ళకుర్రాడిలాగ హుషారుగా ఉంటాడు. ఇంతకుముందు రాత్రే మాయింట్లో బియ్యం పట్టుకెళ్లేరు. ఇంకేమవసరం వచ్చిపడ్డాదో? పాపం పొద్దున్నే అడిగేడు. అంచేత వెంటనే యిచ్చేను.

"అల్లుడూ, ఇవాళ సాయంకాలం వద్దుకాని, రేపు సాయంత్రం మాయింటికోసారి రా. అంతా నూరి సిద్ధంగా ఉంచేను. ఈ రూపాయితో ఏంచేస్తానో చూద్దువుగాని" అని చటాలున లేచి వెళ్ళిపోయేడు.

మావయ్య తిరిగి స్వగ్రామం వచ్చి ఎన్నాళ్లో కాలేదు. ఎలిమెంటరీ స్కూలుమాస్టరు పనిచేసి రిటైరయేడు. అయిదేళ్ళింకెక్కడో మాస్టరుపని చేసేడు. ఆ ఉద్యోగం అయింది. ఇహా నే ఉద్యోగం చెయ్యడానికి వీల్లేక ఇక్కడికి వచ్చేడు. ఇల్లుతప్ప ఇంకేం లేదు. ముప్పైఏళ్లు పనిచేసినా పెన్షనయినా అయ్యవార్లకిఉండదుకదా! ఇంకానయమే. మావయ్యకి తాతలు కట్టించిన యిల్లైనా ఉంది. ఏదో మా వీధిలో ఉన్నవాళ్ళని చెప్పుకోవడమేకాని అంతకుముందు పరిచయం లేదు. ఎప్పుడూ పైఊళ్లోనే పనిచేశేడు. స్వంత యిల్లుందని వచ్చేడుకాని ఈ ఊరికీ అతనికీ సంబంధమే లేదు. వచ్చి ఆర్నెల్లైందో లేదో మాకు మాత్రం ఆత్మబంధువైపోయేడు. అయిదారిళ్ళలో పిల్లలకి ప్రైవేట్లు

చెప్పుకుని బతుకుతున్నాడు. అతని పెద్దపిల్లలంతా ఆడవాళ్లు. కొడుకులు చిన్నవాళ్లు. హైస్కూలు క్లాసులు చదువుతున్నారు. జీవితం కష్టంగా గడుస్తున్నా ఏ బాధా పట్టించుకోకుండా సంచరిస్తాడు. మావయ్యగారు ఇంటిపక్కకి వెళ్ళకుండా బజారువేపుకే వెళ్లిపోయేరు. ఆ వెళ్ళడంలో అంగలు వేసుకుంటూ కుర్రాడిలాగే వెళ్తున్నాడు. అతని నడకతీరే అంత. చిన్నపిల్లలకి పాఠాలు చెప్తూ జీవితం గడిపి, తనూ చిన్న పిల్లడిగానే ఉండిపోయేడు. అంతా నూరి సిద్ధంగా ఉంచాలని చెప్పేడు. ఏమిటో ఆ నూరి ఉంచింది. దీపావళి వెళ్లిపోయినా మరో దీపావళి చేస్తాడు కాబోలు!

ఆమర్నాడు సాయంత్రం వాళ్లింటికి పిల్చేడన్న సంగతే నాకు జ్ఞాపకం లేదు. మా అమ్మాయి తొందర తొందరగా తల్లిచేత జడ వేయించుకొని, గౌను వేసుకుని టీప్ టాప్‌గా తయారై నాముందునుంచే ఒక్కపరుగు తీసింది. "ఎక్కడికే" అని నే నడుగుతూ నేఉన్నా అది వీధిలోకి తుర్రుమని పారిపోయింది. సాయంకాలం ఐదున్నరైంది. ఎలాగూ వీధిలోకి వెళ్లాలి. లేచి బట్టలేసుకుంటున్నాను. మాయింటి దాసీది దానికొడుకుని వెంటబెట్టుకుని అంట్లు తోమడానికి వచ్చింది. "మీ మావయ్యగారో పాలి రమ్మన్నారు బాబూ" అని కబురు తీసుకొచ్చింది.

వెళ్లేను మావయ్యగారింటికి. చీడీ మీద అత్తయ్యగారు కూర్చున్నారు. పచ్చగా పసుపు రాసుకున్న మొహం మీద రూపాయికాసంత బొట్టు పెట్టుకొని ఎప్పుడూ కలకల్లాడుతూ ఉంటారావిడ. వేరే మహాలక్ష్మి ఎక్కడో ఉందని చూడక్కర్లేదు. ఆవిడ మొహం చూస్తే నిజంగా చేసిన పాపాలు పోతాయి. ఎప్పుడూ లేంది ఆవిడ మొహం ఎంచేతో యిప్పుడు ముడుచుకుపోయిఉంది. ఆలోచనంటే ఏమిటో ఎరుగని ఆవిడ, బుగ్గమీద చెయ్యిపెట్టుకుని ఆలోచిస్తోంది.

పెరటివేపు చూశా. అంగుళం జాగా లేకుండా మొక్కలతో నింపేశాడు. చేమంతిపువ్వుల శోభ చెప్ప తరంకాదు. లేని జాతంటూ లేదు. నందనవనంలా ఉంది. మావయ్యగారి మొక్కలగురించి కథ రాస్తే మొక్క కొక కథవుతుంది. ఎక్కడ ఎలా ఎప్పుడు ఆ మొక్కని సంపాదించేడో అంతా మావయ్యగారే చెప్పాలి.

"మావయ్యగారేరి?" అడిగేను. నేనన్నమాట ఆవిడకి వినిపించిందో లేదో కూడానూ. నేనన్న వెంటనే కుర్రకారు చప్పట్లు చరుస్తూ చేసిన గందరగోళం కాకిగోలా దబ్ దబ్ మని చప్పుళ్లూ చెవుల్ని బద్దలు కొట్టేయి. ఏమిటా అని డాబా కమ్ముల వేపు చూసేను.

"వినపడిందా బాబూ. అదే. వెళ్ళి చూడు. మీ మావయ్యగారు చేస్తున్న పని! ఆయనకప్లకి సంతోషించేవాడివి నువ్వో వాడివి దొరికేవు. వెళ్లు. వెళ్లు" అన్నారు అత్తయ్యగారు. శాంతమూర్తయిన ఆవిడ నోటంట కోపంతోటీ, విసుగుతోటీ మాటలనిపించిన ఆ పని ఏమిటైయుంటుందీ అని అనుకుంటూ క్షణంలో డాబా ఎక్కేను. డాబా మీద దృశ్యం నన్ను ఆశ్చర్యంలో ముంచేసింది. మావయ్యగార్ని చుట్టబెట్టుకుని ఆయన కొడుకులు సీనూ, వాసూలూ, పైరివేటు కుర్రాళ్లూ, ఆ వీధికుర్రాళ్లూ మా అమ్మాయి అందరూ ఉన్నారు. పిల్లలమధ్య "పలేతా" పట్టుకుని మావయ్యగారు భరతనాట్యం చేస్తున్నారు.

"రావోయ్ సరిగ్గా సమయానికొచ్చేవు" అని ఆహ్వానించేరు.

"నానోయి, చూడు చూడు తమాషా. హాయి హాయి" నా కూతురు వేలు పైకెత్తి చూపెట్టింది. ఎర్రటి పడగా, దాంతోటి నీలం బెలూనూ కిందికి దిగిపోతున్న ఎర్రటి సూర్యబింబాన్ని, నీలాకాశాన్ని అందుకోడానికి పరిగెడుతున్నాయి. వీటికి దక్షిణంగా కొంచెం దగ్గరలో తోకలేని ఓ ఆకుపచ్చ పడగ ఎగురుతోంది.

ఆకాశంలో ఏమూల చూసినా గాలిపడగలే. పండుగముందు శీతాకాలం రాగానే ఊరందరికీ యిదే పిచ్చి. గాలిపటాలెగరెయ్యడం, పడగలని కోయించడం, తెగిపోయిన పడగ గాల్లో ఎగురుతూఉంటే కుర్రాళ్ళంతా దానివెంట పరిగెడుతూఉండడం పరిపాటే. నాకు మాత్రం చలికాలం సాయంకాలం ఆకాశంలో ఈ గాలిపడగలతో ఎంత సరదాచేస్తారో తెలీదు. వీదో కుర్రాళ్లు ఎగరేసుకుంటారు అనే నాభావం. ఆకాశంనిండా గాలిపడగలే. ఒక పడగని ఇంకొక పడగ కొయ్యడానికి ప్రయత్నం చేస్తూ ఉన్నది. భూమ్మీద ఓప్రాణిని ఇంకో ప్రాణి కబళిస్తున్నట్టే ఓపడగని ఇంకొకపడగ దారంతో కోసి దాని ఎగురుబాటంతా అంతం చేస్తున్నాది.

"తాతయ్యా మనపడగే కిందనుండిపోయింది"

"ఊఁ ఏమిటన్నావు? ఇదిగో.

[illegible]" అన్నారు మామయ్యగారు.

"ఎగురూ ఎగురూ పైకెగురూ ఓ ఎర్రపడగా" అంటూ పాడ్డం మొదలెట్టింది మా అమ్మాయి. దాంతోటి మిగిలినకుర్రాళ్లు శ్రుతి కలిపేరు. "ఎగురూ ఎగురూ" అని చెవులు గింగురుమన్నాయి. పిల్లల గొంతులని మించిన గొంతుకతో 'ఎగురూ ఎగురూ' అంటూ మామయ్యగారు దారంతో ఏం గమ్మత్తు చేసేరో కాని చూస్తూఉండగానే ఎర్రపడగా పడగతో పాటు బుడగా మీదకి లేచిపోయేయి.

"హేహే, అద్గదీ. హాయి డబ్బా" అంటూ చప్పట్లు చరుస్తూ కుర్రాళ్లు నాట్యం చెయ్యడం మొదలెట్టేరు. మామయ్యగారు పరీక్ష ప్యాసైన కుర్రాడిలా పొంగిపోతున్నారు. ఆ మేష్టారి వేపూ, ఆ పిల్లల వేపూ వాళ్ళ ఆనందానికి కారణమైన ఆ ఎర్రపడగా, నీలంబెలూన్ల వేపూ కళ్ళప్పగించి నిలబ్బండిపోయేను.

"ఏం అల్లుడా ఇంత ఆలస్యంగా వచ్చేవు? అల్లుడివైనందుకు అల్లుడి టెక్కు చూపెడతావు! రెండు కబుర్లుపెట్టినా ఆలస్యమే చేసేవు!" అని వాదు వేసేడు.

"ఇందాకట్లా మనబుడ్డీ నీలం పడగతో యుద్ధంచేసినప్పుడు నువ్వు రాలేదు. బుడ్డీని దించేసేక వచ్చేవు! ఏం చేస్తాం? ఏమర్రా పిల్లలూ. నీలం పడగని ఎలా కోసేసేం?" అన్నారు మామయ్యగారు.

"ఒక్క నీలంపడగా? వీడుపోగ అని వెంటపెట్టి, వెంటపెట్టి కోసేం. ఓ! ఎన్నితిప్పలు పెట్టేం! పాపం మీదకి లేవడం మనబుడ్డీని అందుకోలేక కిందకి దిగిపోవడం. కిందకీ మీదకీ కుప్పిగంతులు వేయించేం. ఆఖరికి కుయ్యోమని ఏడుస్తూ పడిపోయింది," అన్నాడు మామయ్యగారి సీను.

"ఇంతకీ బుడ్డీఅంటే ఏమిటండీ?" అడిగేను.

"ఏమిటీ? నీకు బుడ్డీ అంటే తెలీదూ? తోకలేనిపడగని బుడ్డీ అంటారు. తోకున్న పడగ స్థిరంగా ఉండి మనం ఎంత పైకిపంపిస్తే అంత పైకి లేచిపోతుంది బుడ్డీకి చంచలత్వం జాస్తి. అంచేతే పైవాడి పడగలని కొయ్యడానికి బుడ్డీయే ఉండాలి," మామయ్యగారు పడగా, బుడ్డీల తేడాలు చెప్పేరు.

"మనబుడ్డీ ఆకాశంమీదుంటే ఈపాటికి ఆకుపచ్చబుడ్డీపని అయేది. మేష్టారు దించేసేరుకాని..." అన్నాడో కుర్రాడు

"నాకు వీటిముక్కా మొహం తెలీదు. ఆ బుడ్డీని ఎగరెయ్యండి ఆ కొయ్యడాలూ అవీ చూస్తాను," అన్నాను

"అవునండీ, మళ్లా ఎగరెయ్యండీ" అన్నాడు సీను.

"ఇందాక ఏడింటిని కోసేం దీంతో ఎనిమిదీ అవుతాయి" అన్నాడు ఇంకో కుర్రాడు.

"ఆకుపచ్చబుడ్డీ పొగరణిచెయ్యాలండీ"

మామయ్యగార్ని మాట్లాడనివ్వకుండా పిల్లలందరూ గొడవ చెయ్యడం మొదలెట్టేరు.

"తాతయ్యా బుడ్డీని తీసుకొస్తానూ?" అని పరిగెట్టింది నా కూతురు. డాబామీద ఓవారపెట్టిన ఎర్రబుడ్డీనీ, దానితోటే ఉన్న ఇంకో "పలేతా"ని తీసుకొచ్చింది.

"మేష్టారూ నేనీ ఎర్రపడగని ఎగరేస్తూ ఉంటానండీ?" అని ఓ కుర్రాడు మామయ్యగారిమీదకి ఎగబాకేడు. మామయ్యగారు చేతిలో ఉన్న "పలేతా"ని ఆ అబ్బాయిచేతికిచ్చి మనవరాలు తెచ్చిన కొత్త "పలేతా"ని పుచ్చుకున్నారు. ఆకాశంమీదకెత్తేను కళ్ళని. ఎర్రపడగా, నీలంబుడగా ఆకాశాన్ని కొలుస్తున్నాయి. పెద్దవిగా కనబడుతున్న వాటి ఆకారాలు నలకలైపోయేయి. వసిష్టుడులా పడగా, దానిపక్కని మిణుకు మిణుకుమంటున్న అరుంధతిలా బుడగా చూడముచ్చటగా ఉన్నాయి. ఆకుపచ్చబుడ్డీ దిన్నపోయి వెలవెలబోతున్న మొహంతో పరీక్షపోయిన కుర్రాడిలా కిందనుండిపోయింది.

మామయ్యగారు బుడ్డీకి కట్టిన దారాన్ని ఓసారి కొలిచి సరిచూసేరు. పలేతాని రెండుచేతులతో పట్టుకుని "ఒరే సీనూ పటాన్ని ఎత్తిపట్టుకో" అన్నారు. సీను బుడ్డీని తీసుకుని డాబాకొసకెళ్ళి ఎత్తిపట్టుకున్నాడు. "ఊఁ వదిలెయ్యి" సీను పటాన్ని వదిలీసేడు. వదిలినవెంటనే అది నాగుపాములా మెలికలు తిరుగుతూ, ఫర్‌ఫరలాడుతూ, బుర్ర కిందికి పెట్టీ, మీదకి పెట్టీ అడ్డదిడ్డాలు పోతూ మీదికి గబగబా లేచింది. ఓ నిమిషంలో పక్కనున్న కొబ్బరిచెట్టు పైకి లేచింది. మరునిమిషానికి దాని ఆకారం చిన్నదైపోయి ఆకుపచ్చ బుడ్డీకి జానెడు తేడాలో ఉంది. మరో

పటానికి బుడ్డీమీదుంచే ఎగరడం మొదలెట్టింది.

"ఇంకయిందిలే సీనుని"

"ఎంతసేపెగురుతావు? నేను ఇక్కడ ఉండగా ఆకాశంలోకి తల పెట్టడమే?"

"అప్పుతుం దప్పుతుంది. పెళ్ళవు తుంది"

పిల్లలందరూ ఆకుపచ్చ బుడ్డీని సంబోధించి తలోమాటా అన్నారు. మెడలు చాచి అందరం ఆకాశం లోకి కళ్ళని పెట్టేసేం. నాలో పెద్ద ఉత్సాహం బయల్దేరింది. ఆతృతతో ఆ రేళ్ళ కుర్రాడినైపోయేను. పిల్లలందరూ గప్‌చిప్‌గా మాటలు బిగించి, చేతులాడిస్తున్నారు. మామయ్యగారు తమాషాగా దారాన్ని ఆడిస్తూ మధ్యమధ్యని లాగుతున్నారు. ఆకుపచ్చబుడ్డీ మీదకిలేవడానికి ప్రయత్నంచేస్తూ కుడిపక్కకి తొలగిపోతోంది. ఆబుడ్డీ కుడికివెళ్తే కుడికీ, ఎడానికివెళ్తే ఎడానికీ, ఎటువెళ్తే అటు మామయ్యగారి ఎర్రబుడ్డీ పరుగులుతీస్తూ దాని వెంటే పరిగెడుతోంది. వీటి సమరాన్ని చూడ్డానికన్నట్టు ఓ బుల్లి పిట్టలగుంపు వీటిపక్కనుంచీ ఎగురుకుంటూపోయింది. వీటికి బాగా దూరంగా ఎర్రపడగా, నీలం తెలుపూ బుర్రలూపుతూ వీటి యుద్ధాన్ని తిలకిస్తున్నాయి.

"ఎటుకావాలంటే అటు మామ బాగా నంపిస్తున్నారే," అన్నాను.

"మరేమిటనుకున్నావు? ఎడం పక్కకి జరుగూ అంటే ఎడంపక్కకి జరగాలి. కుడిపక్కకి ఎగురూ అంటే కుడివేపే ఎగరాలి. మీద కెళ్లూ అంటే మీదకెళ్లాలి. కిందకి దిగూ అంటే దిగాలి దారం నా చేతిలో ఉన్నంతసేపూ నే చెప్పినట్టల్లా నడవ్వలసిందే! ఇప్పుడుచూడు. చూడండర్రా పిల్లలూ. జాగ్రత్తగా చూడండి" అన్నారు మామయ్యగారు.

ఎర్రబుడ్డీ దడుంగున కిందికిదిగి తటాలున మీదకి లేచిపోయింది. అంతే! ఆకుపచ్చబుడ్డీ పల్టీలు కొడుతూ కింద రాలిపోతోంది. "హోయిహోయి, హోహో అంతే కావాలి అంతేకావాలి, ఎనిమిదోది, ఎనిమిదోది" అంటూ ఈలలు వేస్తూ పిల్లలు గెంతుతున్నారు. మెడలు నొప్పెడుతున్నా ఎర్రబుడ్డీ మీంచీ దృష్టి మరల్చలేదు. విజయగర్వంతో ఊగిసలాడుతూ స్వర్గాన్నందుకోడానికి ఉరకలేస్తోంది ఎర్రబుడ్డీ! అంతరిక్షానికిపోయి ఎంతో ఉల్లాసంతో ఎగురుతున్న ఆకుపచ్చబుడ్డీపని అయిపోయింది. తల వేలేసి అంత అంతరిక్షాన్నుంచీ కిందికి పతనమైపోతున్నాది. ఆ పతనాన్ని చూస్తే ఎంతో జాలివేసింది. పతనమై పతనమై ఓ చెట్టు శిఖరానికో ఎలక్ట్రిక్ తీగలకో చుట్టుకుపోతుంది. మామయ్యగారి ఎర్రబుడ్డీ, ఎర్రపడగా పడగకింద బుడగా గర్వాతిశయంతో ఎగురుతున్నాయి.

"ఎలా ఉందోయి అల్లుడూ" అడిగేరు మామయ్యగారు.

"అద్భుతంగా ఉంది. ఇందులో కూడా మీరు ఉద్దండులన్నమాట! కొయ్యడంఅంటే ఏమిటో యిప్పుడు బాగా తెల్సింది"

"ఎంతమజాగాఉందో చూసేవా? ఇదీ ఒకకళే! మనం ఎలా వెళ్ళమంటే అలా నడుస్తోంది, చూడు. నిన్న నీదగ్గిర్నించి వెళ్ళాకే కొనేసేను. ఉల్లిపొరకాగితాలూ, [illegible] దారమూనూ. నిన్నరాత్రికే పోగలు తయారైపోయేయి. ఇవాళ సాయంత్రం యుద్ధానికి "మాంజా" దారం సిద్ధంచేసీసేను. చెప్పేనుగా, నీదగ్గిరకి రాకముందే గాజు పొడి నూరేను"

"గాజుపొడెందుకూ!"

"మాంజా"కి. దారానికి మెత్తని గాజుపొడి పట్టించి ఎండపెడతారు. చెయ్యడానికి పద్ధతి తెలియాలి. పట్టుకుచూడు" దారాన్ని పట్టుకునిచూసే. గరుగ్గా ఉంది.

"ఆఁ ఆఁ అలా రాయకు. కోసుకుపోతుంది. "మాంజా"ల్లోనూ అసలు సిసలైన "మాంజా." నాచేతి "మాంజా"కి యింకేదీ సరిరాదనుకో" అన్నారు.

సరదాకేదో పిల్లలెగరేసుకుంటారని తెల్సుకాని దీనికింత గ్రంథం ఉంటుందని ఎప్పుడూ అనుకోలేదు. ఎవరూ చెప్పాలేదు.

"దీనికోసమే ఆవిడ అలా చిర్రుబుర్రులాడిపోతోంది! మూతి ముడుచుకొన్నుంది! రోజూ పైసా దండగచేస్తేనని ఏడుస్తోందికాని దీనిమజా దానికెలా తెలుస్తుంది? చిన్నపిల్లాడిలా ఏమిటీపన్లంటుంది. పడగని కోస్తూఉంటే ఎంతసరదాగా ఉందో నువ్వే చూసేవా? దీంతో ఎనిమిదిపటాల్ని నఫా చేసేను. మూడుబుడ్డీలూ, ఐదు పడగలూ. అన్నిరంగులూ లేందే ఏదవుతుంది చెప్పూ? పడగల్ని కొయ్యడానికి బుడ్డీ ఉండాలి. మాంజా ఉండాలి. పతేతాలే లేకపోతే యింత బాగా దారాన్ని వదలగల్నా? ఇంకోటొచ్చీ బెలూనుంది కిందటి సంవత్సరం నుంచీ పటానికి బెలూనుకట్టి ఎగరేద్దామనుకుంటున్నాను. మొత్తం

"మాంజా" దారం

రూపాయీ అయిపోయిందనుకో. అయితేనేం? ఏమీ ఖర్చుపెట్టకుండా సరదా లెలా తీరతాయి?" అన్నారు మావయ్యగారు.

"కాంగా కాంగాగోళ్లు, కాంగా కాంగాగోళ్లు" అంటూ పిల్లలందరూ చేతులెత్తిఅరవడం మొదలుపెట్టేరు. కొంగలబారుబుడ్డీ, వడగల పక్కనుంచీ నివాసాలకి ఎగురుతూ వెళ్ళిపోయింది. అవి కనపడుతున్నంతసేపూ పిల్లలందరూ చేతులుబోర్లించి మీదకెత్తి ఉంచేరు.

"ఇదిగో నాగోరుమీద పడ్డాది"

"నాకూ పడ్డాది"

"మూడింటమీద పడ్డాది"

ఒకళ్ళమీద ఒకళ్లు పడిపోతూ, కుమ్ములాడుకుంటూ, గోళ్ళనిచూసుకున్నారు. కొంగలకిచూపిస్తే గోళ్లకి తెల్లటి మచ్చలు పడతాయని కుర్రాళ్లు కొంగలకి గోళ్లు చూపెడతారు.

"ఏమర్రోయి నాగోరుకీపడ్డాది" అన్నారు మావయ్యగారు. ఆయన చేతిని పీకేస్తూ, మీద పడిపోతూ తెల్లమచ్చని పిల్లలందరూ చూసేరు. నాగోళ్లూ చూసుకున్నాను. నావి స్వచ్ఛంగా ఉన్నాయి.

"నాన్నా చీకటి పడిపోతోంది" అన్నాడు మావయ్యగారి సీను.

"ఒరే, నువ్వొ దించీరా" అని మావయ్యగారు దారాన్ని చుట్టడం మొదలెట్టేరు. వడగనీ బుడగనీ ఎగరేస్తున్న కుర్రాడు "వలేతా" రెండుకొసలనీ రెండుచేతులతో పట్టుకుని మిషన్లా దారాన్ని చుట్టడం మొదలెట్టేడు. నలకల్లాఉన్న బుడ్డీ, వడగా, బెలూన్లఆకారాలు పెద్దవైపోతున్నాయి. రానురాను అవి రాక్షసాకారాలు దాల్చేయి. డాబామీద రాబందుల్లా రెండు కావుల కాగితాలతో చేసినవడగా బుడ్డీలూ, భూతంలా బాటాబెలూను వాలేయి. మావయ్యగారు చిన్నపిల్లల్ని చేతుల్లోకి తీసుకుంటున్నట్టు బుడ్డీని, వడగనీ, బుడగనీ జాగ్రత్తగా అందుకున్నారు.

"వీటికోసం వారం రోజులబట్టీ ఆలోచిస్తున్నాను. ఈ కుర్రాళ్ళకింకా సెల అవలేదు. ఎలాగ? ఏం చెయ్యడం? నిన్న నింక పట్టలేక నిన్నడిగేసేను." చెప్పేరు మావయ్యగారు.

"తాతయ్యా బుడగ నేను పట్టుకోవద్దూ?"

"ఓసారి పట్టుకుని యిచ్చెయ్యి. కిందకి నువ్వు తేలేవు. పేలిపోతుంది" మనవరాలి చేతిలో బెలూ నోసారి పెట్టేడు. అమ్మాయి దానిమీద చేత్తో ఫర్ ఫర్ మనేటట్టు రాసి, మొహంమీదోసారి పెట్టుకుని యిచ్చేసింది. డాబాదిగికిందికివచ్చేం.

"వేస్తారూ రేపూ ఎగరేస్తారు కదండీ"

"ఎందుకెగరెయ్యనూ? రేపూ రండి."

"నమస్కారమండీ" అని అందరూ దణ్ణాలుపెట్టి బిలబిల్లాడుతూ వెళ్ళిపోయేరు. నా చెయ్యి పట్టుకొని నిల్చుంది మా అమ్మాయి. బెలూన్ని తాడేసి దూలానికి వేళ్లాడదీసి వడగలని బీరువామీద పదిలంగా దాచేరు. అత్తయ్యగారు ఎక్కడ కూర్చున్నారో అక్కణ్ణించి కదల్లేదు.

"అమ్మా అన్నం పెట్టవే" అన్నాడు సీను.

"అన్నంలేదు దణ్ణంలేదు. గాలిపటం ఎగరేసుకోండి" అన్నారు అత్తయ్యగారు. ఫకాలుమని నవ్వేరు మావయ్యగారు.

"కోపంవస్తే నీ మొహం మరీ బాగుంటుందిసుమీ" అన్నారు. అత్తయ్యగారు అందమైన మనిషే.

"బాగుంటుంది. బాగుంటుంది. చూసేవుకదా నాయనా. ఎవరిపని బాగుందంటావు?" అని నావేపు తిరిగేరు.

"చెప్పేనుకదోయి అల్లుడూ రూపాయి దండగైపోయిందిట. నువ్వు చూసేవుకదా! దండగైందంటావా?"

"అచ్చే దండగేమిటి?" అన్నా.

"ఏమిటీ! నీకూ అలాగే తోచిందీ? మావకితగినఅల్లుడివిదొరికేవు! దండగవలేదుట! మొన్న మీయింట్లో బియ్యం బదులు తెచ్చుకున్నాం. ఇవాళ పొయ్యిమీదికి గిన్నెక్కే మార్గంలేనేలేదు. ఇచ్చ రూపాయి తీసుకొచ్చి చేసిందేమిటయ్యా అంటే గాలిపటం ఎగరేసేరు. గాలిపటం. వంటాండలేదని తెల్సే. చీమ కుట్టినట్టైనాలేదు మనిషికి. నా తంటాలు నేను పడవల్సిందే! ఏమనుకోడం? ఆయనగారికి తోడు నువ్వొహడివి. ఆయన ఏంచేసినా మాఁ బాగుందంటావ్" అన్నారు అత్తయ్యగారు. మావయ్యగారు మాట్లాడకుండా బుర్రగోంచుకున్నారు. సీనూ వానూ బిక్కమొహాలేసుకుని నించున్నారు. ఆయన తత్వం నాకాశ్చర్యం కలిగించింది. అంత ఆనందానిచ్చిన గాలిపటం దండగని అండానికి నాకూ నోరురాలేదు.

"సీనూ, నంచీ పట్టుకురావోయి" అని లేచేను.

"నువ్వు పంపించకు నాయనా! ఈ మనిషికి బాగా తెలిసి రావాలి" అన్నారు అత్తయ్యగారు. నేను మాట్లాడకుండా సీనుని తీసికెళ్ళి ఓ శేరుబియ్యం యిచ్చి పంపించేను.

★